సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 7 । జనవరి । 2024



పరిశోధనలకు పుట్టినిల్లు భారత్

ఆనందపురం: విజ్ఞాన్ విహార్ విద్యాలయం వార్షికోత్సవం సందర్భంగా శనివారం వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది.



రూసా డీపీ ఏయూ సందర్శన

విశాఖ: ఏయూని రూసా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బోల భాస్కర్ శనివారం సందర్శించారు. వీసీ సమత ఆయనను సత్కరించారు.



అప్పన్న దీక్షల విరమణ

అప్పన్న నామస్మరణతో సింహగిరి మార్మోగింది. మాలధారుల దీక్షా విరమణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. 8లో

న్యూస్‌రీల్

8, 9 తేదీల్లో ఎస్ఐ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, విశాఖపట్నం: ఎస్ఐ రాతపరీక్ష, దేహ ధారుడ్య పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలనకు ఈనెల 8, 9 తేదీల్లో హాజరుకావాలని విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ తెలిపారు. పెదవాల్తేరులో గల డీఐజీ కార్యాలయానికి ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోపు హాజరుకావాలని పేర్కొన్నారు. సివిల్ ఎస్ఐ (పురుషులు/మహిళలు), ఏపీఎస్పీ(ఆర్ఎస్ఐ) పోస్టులకు ఎంపికైన వారు మాత్రమే రావాలని సూచించారు.

వీఎంఆర్‌డీఏ సీఈగా భవానీశంకర్



విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ పి.శివప్రసాద్‌రాజు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ భవానీ శంకర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీసీఆర్‌డీఏలో ఎస్ఈగా ఉన్న శివ ప్రసాద్‌రాజు డిప్యుటేషన్‌పై వీఎంఆర్‌డీఏ సీఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. తాజాగా ఆయనను బదిలీ చేస్తూ సీఆర్‌డీఏ కమిషనర్‌కు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


మినీ గోకులం అక్రమాలపై డీఎస్పీ విచారణ



రైతులను విచారిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కోటవురట్ల: మినీ గోకులం షెడ్ల పథకంలో జరిగిన అక్రమాలపై డీఎస్పీ పి.శ్రీనివాసరావు శనివారం విచారణ చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో నష్టపోయిన రైతులను విచారించి వివరాలు నమోదు చేశారు. రాజుపేటకు సంబంధించి 39 మంది, కొడవటిపూడికి చెందిన 27 మంది రైతులకు పథకం నగదు జమ కాకపోవడంతో గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కొంతకాలంగా దర్యాప్తు జరుగుతోంది. వాస్తవానికి ప్రభుత్వం షెడ్లకు సంబంధించిన నగదును విడుదల చేయగా కాంట్రాక్టర్ షెడ్లు నిర్మించారనే కారణంతో నగదును కాంట్రాక్టర్ అకౌంట్‌కు మళ్లించారు. దీంతో రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. షెడ్లు తామే నిర్మించుకున్నామని అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై అవినీతికి పాల్పడ్డారని రైతులు ఆరోపించారు. రైతులు, కొడవటిపూడి సర్పంచ్ కోసూరు అప్పారావు, రాజుపేట పాల సంఘం డైరెక్టర్ సూరిశెట్టి ప్రసాద్ విచారణలో పాల్గొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి గతంలో ముగ్గురు అధికారులపై చర్య తీసుకున్నారు.

జెడ్పీ ఉద్యోగులకు పదోన్నతులు



పదోన్నతులు పొందిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, సీఈవో పోలినాయుడు

మహారాణిపేట: జిల్లాపరిషత్‌లో పలువురు ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో శనివారం జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన ఉద్యోగులకు చైరపర్సన్ సుభద్ర, జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పదోన్నతులు పొందిన 9 మంది జెడ్పీ చైర్‌పర్సన్, సీఈవోలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ మినిస్ట్రీయల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ ఎస్.సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య విప్లవం

ఒకనాడు వైద్య విద్య గగన కుసుమం.. వేళ్ల మీద లెక్కపెట్టగలిగిన సంఖ్యలో మెడికల్ కాలేజీలు.. అందులో అరకొరగా సీట్లు.. బాగా చదివి, ఎంట్రన్స్‌లో ర్యాంకు తెచ్చుకున్నా వైద్య కళాశాలలో సీటు దొరుకుతుందన్న గ్యారంటీ లేదు. ఇప్పుడు పరిస్థితి మారింది. జిల్లాకో కాలేజీ.. ఏడాదికి 150 మంది చదువుకునే అవకాశం.. వైద్య విద్యార్థులకు సువర్ణావకాశం.. సూపర్ స్పెషాలిటీ విభాగాలతో బోధనాస్పత్రి కూడా అనుబంధంగా ఉండడంతో జిల్లావాసులకు అధునాతన వైద్యం చెంతకే వచ్చినట్లయింది..



- మెడికల్ కళాశాల రాకతో అందుబాటులో వైద్య విద్య.. అధునాతన వైద్యం
- సంవత్సర కాలంలో సగం నిర్మాణ పనులు పూర్తి
- ఈ ఏడాది ఆఖరు నాటికి సిద్ధం చేయాలన్నదే లక్ష్యం
- 52.17 ఎకరాల్లో రూ.500 కోట్లతో కళాశాల నిర్మాణం



మెడికల్ కళాశాల నమూనా



నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల

నర్సీపట్నం: పేదలు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య విప్లవానికి నాంది పలికారు. జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. రాష్ట్రంలో కొత్తగా 17 వైద్య కళాశాలలు వస్తున్నాయి. అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ 30న సీఎం మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశారు. ఏడాది కాలంలో చాలావరకు నిర్మాణ పనులు జరిగాయి. వచ్చే డిసెంబర్‌లో కళాశాల ప్రారంభించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. సీఎం నిర్ణయంతో వైద్య విద్యతో పాటు ఆధునాతన వైద్య సేవలు గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

630 పడకలతో బోధనాస్పత్రి

వైద్య కళాశాలకు అనుబంధంగా బోధనాస్పత్రిని తప్పనిసరిగా ఏర్పాటు చేస్తారు. దీంతో ఈ ప్రాంతానికి సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించే అధునాతన వైద్యశాల రానుంది. భీమబోయిపాలెంలో 52.15 ఎకరాల్లో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నారు. ఏపీ వైద్య సేవల మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఇంజినీర్ల పర్యవేక్షణలో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ వారు పనులు నిర్వహిస్తున్నారు. ఏడాది కాలంలో సగం పనులు పూర్తయ్యాయి. 630 పడకలతో బోధనాస్పత్రి రూపుదిద్దుకుంటోంది. మెడికల్ కళాశాల నిర్మాణంతో ఆరోగ్యం, వైద్య విద్య అందుబాటులోకి వస్తున్నాయి. ప్రతి ఏటా 150 మంది విద్యార్థులు ఇక్కడ వైద్య విద్యను అభ్యసించనున్నారు.

మొత్తం 630 పడకలు

బోధనాస్పత్రిలో 630 పడకలు ఉంటాయి. జనరల్ మెడిసిన్ బెడ్స్–130, జనరల్ సర్జరీ–130, పీడియాట్రిక్స్–75, ఆర్థోపెడిక్–75, గైనికాలజీ–100, ఆప్తమాలజీ–20, సైకియాట్రిక్స్–20, రినోలజీ–20, టీబీ–20, డెర్మటాలజీ–10, ఎమర్జెన్సీ మెడిసిన్–30 పడకలతో ఏర్పాటు చేస్తున్నారు.

బోధనాస్పత్రిలో విభాగాలు..

వైద్య కళాశాలకు అనుబంధంగా వివిధ విభాగాలతో బోధనాస్పత్రిని ఏర్పాటు చేస్తారు. ఇక్కడ ఎమర్జెన్సీ, క్యాజువాలిటీ వార్డులు, డయాగ్నోస్టిక్స్, ఆల్ క్లినికల్ ఏపీడీ, మెటర్నిటీ ఆపరేషన్ థియేటర్లు–2, మేజర్ ఆపరేషన్ థియేటర్లు–8, ఎన్ఐసీయూ–16, ఎస్ఐసీయూ–16, ఎంఐసీయూ–16, గైన్ ఐసీయూ–5, హెచ్‌డియూ–5, పీఐసీయూ–5, ఎంఎన్‌సీయూ–14, ఆర్ఐసీయూ–5, బర్న్ వార్డులు–5, ఐసీసీయూ–6, డయాలసిస్ యూనిట్లు–18 ఏర్పాటు చేస్తున్నారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పర్యవేక్షణలో వైద్య సేవలు అందించనున్నారు. కేజీహెచ్‌కు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే అన్ని రకాల వ్యాధులకు వైద్య సేవలు అందనున్నాయి.

డిసెంబర్‌లో ప్రారంభం

ప్రభుత్వం నిర్దేశించిన సమయం కంటే ముందే మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పూర్తి చేస్తాం. పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. వచ్చే డిసెంబర్‌లో కళాశాలను ప్రారంభించి, వైద్య విద్యకు సంబంధించి అడ్మిషన్లు స్వీకరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి చేస్తాం. –నాయుడు, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

మర్రిపాలెం (విశాఖ): ప్రయాణికుల సౌకర్యార్థం సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. హైదరాబాద్–బ్రహ్మపూర్ (07027) ఈ నెల 13న రాత్రి 10.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.25కు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 10.27కి బయలుదేరి మధ్యాహ్నం 3.15కి బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్ –హైదరాబాద్ (07028) స్పెషల్ రైలు బ్రహ్మపూర్‌లో ఈ నెల 14న సాయంత్రం 6 గంటలకు బయలుదేరి రాత్రి 11.23కి దువ్వాడ చేరుకుని అక్కడి నుంచి 11.25కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.30కు హైదరాబాద్ చేరుకుంటుంది. అలాగే సికింద్రాబాద్–బ్రహ్మపూర్ స్పెషల్ రైలు(07025) ఈ నెల 12,19 తేదీల్లో రాత్రి 7.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ చేరుకుని 5.47గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 11.15 గంటలకు గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్–సికింద్రాబాద్(07026) స్పెషల్ రైలు ఈ నెల 13 , 20 తేదీల్లో బ్రహ్మపూర్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ చేరుకుని అక్కడ నుంచి తిరిగి 5.12 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

కేకే లైన్లో రైళ్ల గమ్యం కుదింపు

ఈ నెల 9న విశాఖలో విశాఖ –కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 10న కిరండూల్‌లో బయలుదేరాల్సిన కిరండూల్ విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్(18513) కిరండూల్ కాకుండా జగదల్‌పూర్ బయలుదేరుతుంది. విశాఖ– కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ 9న జగదల్‌పూర్ వరకు నడుస్తుంది. 10న కిరండూల్‌లో బయలుదేరాలల్సిన విశాఖ(08552) కిరండూల్ పాసింజర్ స్పెషల్ కిరండూల్ నుంచి కాకుండా జగదల్‌పూర్ నుంచి బయలు దేరి విశాఖ చేరుకుంటుంది.

‘మిచాంగ్’ బాధితులకు పరిహారం



మాడుగులలో తుపాను బాధితులకు నష్టపరిహారం అందజేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి తదితరులు

- పశువులను నష్టపోయిన అయిదుగురు రైతులకు రూ.90 వేల సాయం

మాడుగుల: గత నెలలో మిచాంగ్ తుపాను కారణంగా పశువులను నష్టపోయిన అయిదుగురు రైతులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం పరిహారం అందజేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బాధితులకు ఆర్థిక సహాయం చెక్కులు పంపిణీ చేశారు. మాడుగుల మండలంలో జంపెన, కింతలి, వీరవల్లి అగ్రహారం, మాడుగుల గ్రామాలు, చీడికాడ మండలంలో తునివలస గ్రామానికి చెందిన రైతులకు రూ.90 వేల పరిహారం అందజేశారు. బాధితులను ఆదుకోవడంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఉదారంగా ఉంటుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పేర్కొన్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, మాడుగుల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల సత్తా

మురళీనగర్: కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో ఇటీవల చెన్నైకు చెందిన గ్రీన్ ఎనర్జీ ఇనీషియేటివ్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాల బాలికలు సత్తా చాటారు. టీపీవో ఎం.హరిబాబు పర్యవేక్షణలో ఈ కంపెనీ నిర్వహించిన రాత పరీక్ష, మౌఖిక పరీక్ష ప్రతిభ చూపిన 8 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సివిల్ విభాగం నుంచి వై.భవాని, జి.పూజితరెడ్డి, మెకానికల్ విభాగం నుంచి అల్లు కరుణ, యోగేశ్వరి, వి.సాయివెన్నెల, లంకా నీరజ, ఎం.దేవ హర్షిణి, లాలం శృతి ఉద్యోగాలు పొందారు. వీరికి కూ.3.30 లక్షల వార్షిక ప్యాకేజీని కంపెనీ చెల్లిస్తుంది. శిక్షణలో భాగంగా మొదటి సంవత్సరం రూ.3.30లక్షలు, రెండో ఏడాది రూ.3.60 లక్షలు, శిక్షణ పూర్తయిన తర్వాత రూ.4 లక్షలకు పైగా ప్యాకేజీ ఇస్తారు. రాయితీపై క్యాంటీన్ సదుపాయం ఉంటుంది. వసతి సంబంధించి తగు చర్యలు తీసుకుంటారు. కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగాలు పొందిన వారికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు నియామకపత్రాలు అందించారు. విభాగాల హెడ్‌లు కేడీవీ నరసింహారావు, కె.మధుకుమార్, జె.రాజేంద్రప్రసాద్, ఏటీపీవోలు ఎన్.జ్ఞాన ప్రసూన, బి.అర్చనరావు, ఆర్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన బాలికలకు నియామక పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- టెన్త్ విద్యార్థుల కోసం 50 రోజుల ప్రణాళిక
- ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు తరగతులు
- సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- హెచ్‌ఎంల సమావేశంలో ఆర్జేడీ, డీఈవో దిశానిర్దేశం



హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతికుమారి, వేదికపై డీఈవో వెంకటలక్ష్మమ్మ

యలమంచిలి రూరల్: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య విశాఖపట్నం ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి, డీఈవో ఎం. వెంకటలక్ష్మమ్మ సూచించారు. యలమంచిలి సెయింట్ మేరీస్ స్కూల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్జేడీ, డీఈవోలు పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుపై దిశానిర్దేశం చేశారు. మార్చిలో జరగబోయే పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంకాలన్నారు. ఇందుకోసం 50 రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించడంతోపాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇందుకోసం ఇప్పటికే ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన మార్గదర్శకాలు పాటించాలన్నారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే మెరిట్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేందుకు డీసీఈబీ ద్వారా పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్‌పై తర్ఫీదు ఇవ్వాలన్నారు. దాని ప్రకారం విద్యార్థులకు స్లిప్ టెస్టులు, వారాంతపు పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని, వాటి ఆధారంగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేయాలన్నారు. ఈ విషయంలో ఎవరైనా ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తే తన దృష్టికి తేవాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ హెచ్‌ఎంలకు సూచించారు. 6వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపితే వారు పదోతరగతికి వచ్చేసరికి మెరికల్లా తయారవుతారన్నారు.

6 నుంచి 9 తరగతి వరకూ ఒక్కో ఉపాధ్యాయుడు ఒక్కో విద్యార్థిని దత్తత తీసుకుని అన్ని రకాలుగా వారు వృద్ధిలోకి వచ్చేలా చూడాలని సూచించారు. టోఫెల్ పరీక్షా విధానం ఉద్దేశ్యం నెరవేరేలా ఉపాధ్యాయులతో పనిచేయించాల్సిన బాధ్యత హెచ్‌ఎంలదేనన్నారు. రానున్న సాధారణ ఎన్నికలకోసం పోలింగ్ కేంద్రాలుగా ఎంపికైన పాఠశాలల్లో టాయిలెట్లు, విద్యుత్, ర్యాంప్, తాగునీటి సౌకర్యాలు ఉండేలా చూడాలని, ఏవైనా మరమ్మతులు అవసరమైతే పాఠశాల నిర్వహణ నిధుల నుంచి ఖర్చుపెట్టి వచ్చే శుక్రవారంలోగా చేయించాలన్నారు.

రక్తహీనత కలిగిన విద్యార్థులు సెలవుల్లో కూడా ఐరన్ మాత్రలు వేసుకునేలా తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. యలమంచిలి ఉపవిద్యాశాఖాధికారి పి.అప్పారావు,హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏవీహెచ్ శాస్త్రి, కార్యదర్శి జె. రవీంద్రబాబు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ రవిబాబు, ఏఎంవో మురళీమోహన్ పట్నాయక్, యలమంచిలి ఎంఈవోలు వై.మీనాక్షి, పి.అరుణ్‌కుమార్, 24 మండలాలకు చెందిన 48 మంది ఎంఈవోలు, 250 మందికి పైగా ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

11న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

మహారాణిపేట: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈనెల 11న నిర్వహించనున్నారు. ఈ సమావేశాలకు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర తెలిపారు. ఈ రోజు ఒకటి నుంచి 7 స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయన్నారు.

నేడు స్పెల్–బి రీజనల్ స్థాయి పరీక్ష

విశాఖ విద్య: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో స్పెల్–బి రీజనల్ స్థాయి పరీక్ష ఆదివారం జరుగనుంది. అక్కయ్యపాలెం లలితానగర్‌లో గల జ్ఞాన నికేతన్ ఎయిడెడ్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగే ఈ పరీక్షకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాతో పాటు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులను కేటగిరీల వారీగా విభజించారు. కేటగిరీ–1 పరిధిలో 1, 2వ తరగతి విద్యార్థులు, కేటగిరీ–2లో 3, 4 తరగతులు, కేటగిరీ–3లో 5, 6, 7 తరగతి విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. 8, 9,10 తరగతుల విద్యార్థులు కేటగిరీ–4 పరిధిలోకి వస్తారు. ఉదయం 9.20 గంటల నుంచి కేటగిరీల వారీగా పరీక్షలు జరగనున్నాయి. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా స్టూడెంట్ గుర్తింపు కార్డు, ప్లాంక్, పెన్ను లేదా పెన్సిల్ వెంట తీసుకురావాలి. ఏమైనా సందేహాలుంటే రీజినల్ ఈవెంట్ మేనేజర్ ఆర్.మారుతి సెల్–8121703348కు సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

పొట్టిదొరపాలెంలో వృద్ధుడి ఆత్మహత్య

బుచ్చెయ్యపేట : మండలంలో గల పొట్టిదొర పాలెం గ్రామానికి చెందిన వృద్ధుడు నంబారు అప్పారావు(72) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న అప్పారావు జీవితంపై విరక్తి చెంది తన ఇంటి దగ్గరలో ఉన్న మామిడి కొమ్మకు ఉరేసికుని మృతి చెందాడు. ఇతని కుమారుడు సత్తిబాబు ఫిర్యాదు మేరకు బుచ్చెయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు శనివారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అప్పారావు మృతదేహానికి శవ పంచనామా చేసి అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్ ఢీకొని మహిళకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన మహిళ

చోడవరం రూరల్: బ్రేక్ ఫెయిల్ కారణంగా అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో 50 ఏళ్ల మహిళ గాయాల బారిన పడి ఆస్పత్రి పాలైన ఘటన చోడవరం ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద చోటు చేసుకుంది. మాడుగుల మండలం కింతలిగ్రామానికి చెందిన సీతా ధర్మరాజు శనివారం విశాఖపట్నం వెళ్లి వస్తూ తమ స్వగ్రామం కింతలి వెళ్లడానికి వేరే బస్సు మారే నిమిత్తం చోడవరంలో దిగింది. అనకాపల్లి నుంచి కింతలి గ్రామానికి వెళ్లే బస్సు కాంప్లెక్సులో ప్రవేశించినపుడు బ్రేకు ఫెయిల్ కారణంగా అదుపుతప్పి పక్కనున్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సమయంలో డివైడర్ చెంతనే ఉన్న ధర్మరాజు సైతం కిందపడడంతో కుడికాలు పాదానికి ఫ్రాక్చర్ అయ్యింది. అక్కడే ఉన్న వారు 108కు సమాచారం అందించడంతో గాయపడిన ధర్మరాజుకు స్థానిక ప్రభుత్వా స్పత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి, అనకాపల్లి ఎన్టీయార్ ఆస్పత్రికి తరలించారు.

రెండు బైకులపై గంజాయి రవాణా

- నలుగురు అరెస్టు

కె.కోటపాడు : ఆనందపురం గ్రామం గుండా కొత్తవలస మార్గం వైపు రెండు ద్విచక్ర వాహనాలపై గంజాయిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను పట్టుకున్నట్టు ఎ.కోడూరు ఎస్.ఐ జె.రమేష్ తెలిపారు. ఆనందపురం జంక్షన్ వద్ద శనివారం వాహన తనిఖీలను చేయగా రెండు ద్విచక్ర వాహనాలపై అల్లూరి జిల్లా జి.మాడుగులకు చెందిన బూరిబోడి చంద్రసాయిదొర, శ్రీకాకుళం జిల్లాకు చెందిన బచ్చల హరీష్, రోణంకి సందీప్, బి.ప్రశాంత్ 22 కిలోల గంజాయిని మూటల్లో పెట్టి తరలిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. నిందితులు నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామని, రెండు వాహనాలను సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు.

సేవల విస్తరణకు 'ఇంటింటికీ డీసీసీబీ'

- అనకాపల్లి జిల్లాలో 12 కొత్త బ్రాంచిల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- విశాఖపట్నం డీసీసీబీ సీఈవో వర్మ



దేవరాపల్లిలో బ్యాంక్ ద్వారా అందిస్తున్న సేవలను వివరిస్తున్న డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్.వర్మ

దేవరాపల్లి : ప్రతి ఇంటికీ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) సేవలను విస్తరించడమే లక్ష్యంగా ×ఇంటింటికీ డీసీసీబీ× పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని విశాఖపట్నం డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్.వర్మ అన్నారు. దేవరాపల్లిలో శనివారం ఆయన పర్యటించారు. డీసీసీబీ ద్వారా అందిస్తున్న సేవలను వివరించి కరపత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఇంటికి తమ బ్యాంక్ ఖాతా, రుణం సదుపాయం కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని, ఈ నెల ఒకటి నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం మార్చి నెలాఖరు వరకు కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి క్షేత్ర స్థాయిలో విశేష స్పందన లభిస్తోందని, ఒక్క రోజులోనే 150 సేవింగ్ ఖాతాలను ఓపెన్ చేశామని అన్నారు. డీసీసీబీ 30 బ్రాంచ్‌ల పరిధిలోని 5 లక్షల మంది ఖాతాదార్లు ఉన్నారన్నారు. రూ.2,150 కోట్లు వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయని, రూ.890 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని వివరించారు. ఈ ఏడాది రూ.400 కోట్లు పంట రుణాలు లక్ష్యంగా కాగా ఇప్పటి వరకు రూ.250 కోట్లు మేర ఇచ్చామన్నారు. ఎస్‌హెచ్‌జీలకు రూ.50 కోట్ల మేర రుణాలు మంజూరు చేశామని తెలిపారు. గృహ రుణాలు రూ.40 లక్షలు, వ్యాపార రుణాలు రూ. 30 లక్షల వరకు, అలాగే బంగారు రుణాలు గ్రాముకు 4400 చొప్పున రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తామన్నారు. అనకాపల్లి జిల్లాలో కొత్తగా 12 బ్రాంచిలకు ప్రతిపాదలను ప్రభుత్వానికి పంపించామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, నోడల్ ఆఫీసర్ కిలపర్తి రామకృష్ణ, స్థానిక బ్రాంచి మేనేజర్ జి.వి.అప్పారావు, స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు దాసరి గోపి, దేవరాపల్లి, డీసీసీబీ ఫీల్డ్ ఆఫీసర్ జి.సంతోష్, క్యాషియర్ జె.వి.సంతోషి, పీఏసీఎస్‌ల సీఈవోలు ఎన్.కనకారావు, ఎ.ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

అంచనా బడ్జెట్‌పై రాద్ధాంతం తగదు



వైస్‌చైర్మన్ అప్పలనాయుడు, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

- మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి
- బడ్జెట్‌పై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం

నర్సీపట్నం : బడ్జెట్‌పై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వాడి వేడి చర్చ జరిగింది. బడ్జెట్‌పై ప్రతిపక్ష సభ్యుల తీరుపై మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి మండిపడ్డారు. టీడీపీ కౌన్సిలర్లకు బడ్జెట్-అంచనా బడ్జెట్‌కు తేడా తెలియకపోవడం దురదృష్టకరమన్నారు. పురపాలక సంఘం 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూ. 33.2 కోట్లుగా అధికారులు నివేదించారు. ప్రారంభ నిల్వ రూ.19.58 కోట్లు, అన్ని పద్దులు కింద జమ రూ.23.39 కోట్లుగా చూపారు. ఆర్థిక సంవత్సర ఖర్చులు రూ. 39.51 కోట్లుగా, ముగింపు నిల్వ రూ.3.46 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. బడ్జెట్ తప్పుల తడకగా ఉందని, సవరణ చేసి బడ్జెట్ మరోమారు ప్రవేశపెట్టాలని టీడీపీ కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి పేర్కొన్నారు. బడ్జెట్‌ను అన్ని విధాలా పరిశీలించిన తర్వాతే ప్రవేశపెట్టామని చైర్‌పర్సన్ బదులిచ్చారు. అంచనా బడ్జెట్ పై టీడీపీ కౌన్సిలర్లు రద్ధాంతం చేయడం తగదని వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు సమాధానం ఇచ్చారు. బడ్జెట్ పేరుకే తప్ప అభివృద్ధి కనపడడం లేదని టీడీపీ కౌన్సిలర్లు పేర్కొనడంతో వైస్ చైర్మన్లు బదులిస్తూ అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత టీడీపీ కౌన్సిలర్లకు లేదన్నారు. మెయిన్‌రోడ్డు విస్తరణతో పాటు, నియోజకవర్గానికి ఎమ్మెల్యే మెడికల్ కళాశాల తీసుకువచ్చారన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ కౌన్సిలర్లు ఆరోపణలు చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ మండిపడ్డారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ టీడీపీ కౌన్సిలర్లు సభ నుండి వాకౌట్ చేశారు. అనంతరం బడ్జెట్‌పై చర్చించి ఆమోదించారు.

వలంటీర్ల ఔదార్యం



కాకినాడలో ముత్యాల నాగేశ్వరావు, భ్రమరాంబకు దివ్యాంగ పింఛను అందజేస్తున్న వలంటీరు రవికుమార్



కిమ్స్ ఆస్పత్రిలో బాధితుడికి పింఛను ఇస్తున్న పవన్‌జగదీష్

మాడుగుల రూరల్ : మండలంలో ముకుందపురం గ్రామానికి చెందిన ముత్యాల భ్రమరాంబకు కాలు విరిగిపోయి, కాకినాడలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ఆపరేషన్ జరిగింది. ప్రస్తుతం అమె కాలు కదపని స్థితిలో ఉంది. అమెకు దివ్యాంగుల పింఛను ప్రతి నెలా వస్తుంది. అలాగే ఆయన భర్త ముత్యాలు నాగేశ్వరావు వృద్ధాప్య పింఛను ప్రతి నెలా అందుకుంటున్నారు. వీరిరువురు కాకినాడలో తమ కుమార్తె ఇంట్లో ఉన్నారు. వీరికి వైఎస్సార్ పింఛను కానుక కింద చెరో మూడు వేల రూపాయలు పింఛను నగదును వలంటీరు బాలిబోయిన రవికుమార్ శనివారం అందజేశారు. ఎంతో ఔదార్యంతో విధులు నిర్వహించిన రవికుమార్‌ను సర్పంచ్ కర్రి గణేశ్, సచివాలయ సిబ్బంది అభినందించారు.

విశాఖలోని ఆస్పత్రికి వెళ్లి...

రావికమతం : రావికమతానికి చెందిన పింఛనుదారుడు అప్పారావు అనారోగ్యంతో విశాఖ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు, అదే ఆస్పత్రిలో దివ్యాంగ పింఛనుదారు తేజశ్వని కూడా చికిత్స పొందుతున్నారు. దీంతో ఆ గ్రామ వలంటీర్ గండం పవన్ జగదీష్ శనివారం ఆస్పత్రికి వెళ్లి ఇద్దరికీ పింఛను అందించారు. పలువురి మన్ననలు అందుకున్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

చోడవరం రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి 36 బాటిళ్లతో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ముందస్తు సమాచారం మేరకు జరిపిన దాడుల్లో పట్టణ శివారు అంకుపాలెం గ్రామానికి చెందిన బొడ్డి కనకరాజు, కన్నెపల్లి సింహాచలంతో పాటు చీడికాడ మండలం వరహాపురం గ్రామానికి చెందిన చీపురుపల్లి సురేష్‌లను అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని, బొడ్డి కనకరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



తీవ్ర గాయాలతో పడి ఉన్న మృతదేహం



రైలు ఢీకొన్న ఘటనలో మృతి చెందిన వ్యక్తి



ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శాంతారాం

అనకాపల్లి : రైలు ట్రాక్‌పై వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ శాంతారాం అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో శంకరం రైల్వేబ్రిడ్జి (పాత, కొత్త) సమీపంలో శనివారం అనకాపల్లి నుంచి విశాఖ వైపు వెళ్తున్న రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (40)ని అక్కడికక్కడే మృతి చెందగా అటుగా వెళ్తున్న మరో రైలు నుంచి ఓ వ్యక్తి (30) జారిపడి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఆయా మృతదేహాలను ఎన్టీఆర్ వైద్యాలయానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్న దీక్షల విరమణ



ఆలయానికి తరలివచ్చిన దీక్షధారులు

సింహాచలం: అప్పన్న నామస్మరణతో సింహగిరి మార్మోగింది. మాలధారుల దీక్షా విరమణ కార్యక్రమం శనివారం శాస్త్రోక్తంగా జరిగింది. నలభై ఒక్కరోజుల మండల దీక్ష, 32 రోజుల దీక్ష చేసిన దీక్షాధారులంతా శిరస్సుపై తిరుముడిని పెట్టుకుని మెట్ల మార్గంలో, ఘాట్‌రోడ్డులో సింహగిరికి తరలివచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి వాటిని సమర్పించి, దీక్ష విరమణ చేశారు. తొలుత సింహగిరికి తరలి వచ్చిన దీక్షాధారులంతా తిరుముళ్లతో స్వామివారి అంతరాలయ దర్శనం చేసుకున్నారు. అనంతరం మాడ వీధిలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద దీక్షాధారులందరి చేత పండితులు శాస్త్రోక్తంగా దీక్షా విరమణ చేయించారు. అనంతరం స్వాతి నక్షత్రం సందర్భంగా నిర్వహించిన నృసింహ హోమాన్ని తిలకించారు. శాంతి కల్యాణంలో పాల్గొన్నారు. దీక్షాధారులంతా స్వామివారి పల్లకితో కొండదిగువ నుంచి పైకి ఘాట్‌రోడ్డులో తరలివచ్చారు.

గొప్ప పరిశోధనశాలి డాక్టర్ రేవూరి



రేవూరి అనంత పద్మనాభరావు రచనలు ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

మద్దిలపాలెం: కథకులు, నవలా రచయిత, అనువాద విమర్శకులైన డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు గొప్ప పరిశోధనశాలి, పట్టుదల గల వ్యక్తి అని ఆచార్య వెలమల సిమ్మన్న అన్నారు. శనివారం కళాభారతి ఆడిటోరియంలో అజో-విబో-కందాళం, రైటర్స్ అకాడమి నిర్వహించిన విశిష్ట సాహితీ సభలో సాహితీ మూర్తి పురస్కార గ్రహీత డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు కృషిని వివరించారు. రేవూరి తాళపత్రిక గ్రంథాలను కూడా రావు చూశారన్నారు. సభ అధ్యక్షత వహించిన మహారాజా సంస్కృతి కళాశాల పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఆయల సోమయాజులు మాట్లాడుతూ ఆంధ్రదేశంలో పాటు కర్నాటకలో కూడా రేవూరి అష్టవధానం నిర్వహించారని గుర్తు చేశారు. కాకరపర్తి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రసార ప్రముఖుల గురించి ప్రసంగించారు. కందళం వ్యవస్థాపకులు అప్పాజోస్యుల సత్యనారాయణ మాట్లాడుతూ 60 ఏళ్ల రేవూరి సాహిత్యంలో విశిష్ట కృషి చేశారన్నారు. వ్యాకరణపై ఆయన మంచి రచనలు చేశారన్నారు అనంతం పద్మనాభరావు రచనల సంపూటి వేదిక ఆవిష్కరించారు.

సోషల్ సైన్సెస్ సెంటర్ ఏర్పాటు చెయ్యాలి



సదస్సులో పాల్గొన్న మాజీ డీజీపీ ఆంజనేయరెడ్డి

సీతంపేట: పోస్టు గ్రాడ్యుయేషన్‌లో హిస్టరీలో విద్యార్థుల రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టాయని, ఇది విభాగాల మూసివేతకు దారితీసే ప్రమాదముందని మాజీ డీజీపీ సి.ఆంజనేయరెడ్డి అన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలో శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ రెండురోజుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రతి సబ్జెక్టు తనదైన అవసరానికి ఉపయోగపడుతుందని, యూనివర్సిటీలో ఏ విభాగాన్ని మూసివేయవద్దని ఏయూ ప్రొఫెసర్ సంపత్‌ను కోరారు. అలాగే నగరంలో సోషల్ సైన్సెస్ సెంటర్ ఏర్పాటు చెయ్యాలని కోరారు. బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్ మాట్లాడుతూ కళాశాల గోల్డెన్ జూబ్లీ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ 46వ వార్షిక సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. బుల్లయ్య కళాశాల ఆరంభం నుంచి మార్జినల్‌లైన్ విద్యార్థులకు విద్యాసేవలందిస్తున్న కళాశాల అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రను ప్రొఫెసర్ వకులాభరణం రామకృష్ణ సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా సావనీర్‌ను ఏయూ వైస్ చాన్సలర్ కె.సమత ఆవిష్కరించారు. సదస్సులో దేశవ్యాప్తంగా 50 మంది ప్రతినిధులు, 100 మంది పరిశోధకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీహెచ్‌సీ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్ కేసీ రెడ్డి, ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విజయవాడకు భవానీ భక్తులు



విజయవాడ పయనమైన భవానీభక్తులు

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలెం గంగపర దేశమ్మ ఆశ్రమంలో భవానీభక్తుల చండీయాగ దీక్షలు శనివారంతో ముగిశాయి. ఆశ్రమంలో దీక్షలు ముగిసిన భవానీభక్తులు ఇరుముడి ధరించి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో జరిగే చండీయాగ పూర్ణాహుతిలో పాల్గొనేందుకు పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీరాం దంపతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

అనకాపల్లి: రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయంలోని ఉప ఆలయమైన శ్రీవైకుంఠనారాయణస్వామి ఆలయం వద్ద ఆదివారం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నట్టు ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రతిష్ఠాపనతో రెండు ధ్వజస్తంభాలున్న ఏకైక ఆలయంగా నిలుస్తుందన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

అనకాపల్లి: స్థానిక శారదాబ్రిడ్జి సమీపంలో జూదం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.1300 నగదును స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ దాడి మోహన్‌రావు శనివారం చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఎన్టీపీసీ మహిళా ఎగ్జిక్యూటివ్‌లకు అభినందన

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ మొదటి యూనిట్‌లో వార్షిక మరమ్మతుల అనంతరం విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించడం(సింక్రోనైజ్)లో విశేష కృషి చేసిన మహిళా ఎగ్జిక్యూటివ్‌లను శనివారం సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు. వార్షిక మరమ్మతుల అనంతరం యూనిట్-1లో శుక్రవారం విద్యుదుత్పత్తిని పునరుద్ధరించిన విషయం తెలిసిందే. మహిళా ఎగ్జిక్యూటివ్‌ల ద్వారా యూనిట్‌ను (సింక్రోనైజ్) పునఃప్రారంభించడం ఎన్టీపీసీలో ఇది మొదటిసారని సిన్హా పేర్కొన్నారు. మహిళా సాధికారితలో ఇది ఓ భాగమన్నారు. కార్యక్రమంలో ఓ అండ్ ఎం జీఎం డి.పి. పాత్ర, ఆపరేషన్ జీఎం టి.ఆర్.రాజగోపాల్, జీఎం మాథ్యూ ఇకోవూరు పాల్గొన్నారు.

హౌసింగ్ కాలనీలో సిమెంట్ రోడ్లు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి

కశింకోట: స్థానిక హౌసింగ్ కాలనీలో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి ప్రారంభించారు. రూ.35 లక్షల ఎంపీ నిధులతో ఈ రోడ్లను నిర్మించారు. రూ.22 లక్షలతో 13 చేతి బోర్లు, శ్మశాన వాటికలలో నీటి సదుపాయం కోసం రూ.9 లక్షలతో చేతి బోర్లు ఏర్పాటు చేశారు. వీటికి సంబంధించిన శిలా ఫలకాన్ని ఎంపీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సర్పంచ్ మంత్రి జయరజని, వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపీడీవో వి.వి. రవికుమార్ పాల్గొన్నారు.

నేడు విశాఖ ఉమ్మడి జిల్లా పీఏసీఎస్ ఉద్యోగుల సమావేశం

అనకాపల్లి: విశాఖ ఉమ్మడి జిల్లా పీఏసీఎస్ ఉద్యోగుల అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక గాంధీనగరం అన్నపూర్ణ బ్యాంకు ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ కోశాధికారి ఒమ్మి ఈశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలో ఉద్యోగులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 466 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 398 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

మూగజీవులకూ ఆరోగ్య కార్డులు

- ఇక నుంచి క్షణాల్లో పశువులకు వైద్యం
- ఆరు పెద్ద పశువులకు ఒక కార్డు
- 20 గొర్రెలు, మేకలకు కలిపి ఒక కార్డు
- అనకాపల్లి డివిజన్‌లో పాడి రైతులకు అందజేసిన కార్డులు: 4,775



అనకాపల్లి రూరల్(యలమంచిలి రూరల్): పశువైద్యం మరింత సులభ రీతిలో జరిగేలా, మూగ జీవాలకు వైద్య సేవలు పక్కాగా అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పశువుల ఆరోగ్య సంరక్షణకు ఆరోగ్య కార్డులు జారీ చేస్తోంది. అనకాపల్లి డివిజన్ పరిధిలో పశువుల సంఖ్య, వాటికి కావాల్సిన మందులు ఇతర అంశాలను ఆన్‌లైన్ చేసి హోలోగ్రామ్‌తో కూడిన పది అంకెల సంఖ్యలో పొందుపరిచి గుర్తింపు ఇస్తున్నారు. ఈ హోలోగ్రామ్‌ను స్కాన్ చేసినప్పుడు ఆ నంబర్‌తో ఎన్ని జీవాలు ఉన్నాయి, రైతు ఎవరు, పశువుకు ఎలాంటి వ్యాధులు ఉన్నాయి వంటి వివరాలన్నీ తెలుస్తాయి. పశువైద్యశాఖ అధికారులు ప్రతి పశువుకూ కార్డు ఇవ్వకుండా ఆరు పశువులకు(పెద్ద జీవాలు) ఒక ఆరోగ్య కార్డును అందజేస్తున్నారు. ఇక మేకలు,గొర్రెలు అయితే 20 జీవాలకు ఒక ఆరోగ్య కార్డు అందిస్తున్నారు. ప్రధానంగా ఇందులో అనేక చాలా సమాచారం పొందుపరిచి ఉంచుతున్నారు.ఒకప్పుడు పొడవాటి కరపత్రంలా ఉండే ఈ కార్డుల రూపకల్పనలో సమూల మార్పులు చేశారు.ప్రస్తుతం జారీ చేస్తున్న కార్డులు హ్యాండ్‌బుక్ వంటి ఆకారంలో ప్రింట్ చేసి పాడిరైతులను ఉచితంగా అందిస్తున్నారు.ఆర్బీకేల్లో పశువైద్య సిబ్బంది వీటి రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడుతున్నారు.

ఉపయోగాలివే...

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ తరపున రెండు రకాల యానిమల్ హెల్త్ కార్డులను జారీ చేస్తోంది. అందులో ఒకటి పశు ఆరోగ్య సంరక్షణ కార్డు. ఇది ఆరు గేదెలు/ఆవులు/పోతులకు మాత్రమే వర్తిస్తుంది. రెండోది గొర్రెలు/మేకల ఆరోగ్య సంరక్షణ కార్డు. ఇదు 20 జీవాలకు వర్తిస్తుంది. ఇందులో పశువులను పోషించే పశుపోషకుడి వివరాలు, పశుసంపద వివరాలు ఉంటాయి. వ్యాధుల నుంచి టీకాల వరకు సమస్త సమాచారం కార్డులో నిక్షిప్తమై ఉంటుంది. మూగ జీవాలకు ఏదైనా అనారోగ్య సమస్యలు ఉంటే ఈ కార్డుతో చికిత్స అందించడం సులభమవుతుంది.

పశువుల వివరాలు

గేదెలు	7,096
ఆవులు	10,348
మేకలు	8,620
గొర్రెలు	7,410



కన్నూరుపాలెంలో పాడిరైతులకు పశు ఆరోగ్య కార్డులు అందజేస్తున్న సిబ్బంది

ఎంతో ఉపయోగం



పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పశువులు, గొర్రెలు, మేకలకు అందజేసే వైద్యం వివరాలు తెలుసుకునే వీలు కలుగుతుంది. రైతులందరికీ వీటిని ప్రభుత్వం అందజేస్తోంది. దీంతో రైతులకు అన్ని సేవలు ఉచితంగా అందుతున్నాయి. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పాడిరైతుల సంక్షేమానికి పలు కొత్త పథకాలు అమల్లోకి తెచ్చారు.పాడి రైతులను ప్రభుత్వం ఆదుకుంటోంది.

– వెల్లింకుల రమణ, పాడి రైతు,తుమ్మపాల

పశువుల ఆరోగ్యానికి రక్ష



పశువులకు హెల్త్ కార్డులు అందజేయడం కొత్తగా ఉంది.వీటి వల్ల పశువులకు ఎలాంటి అనారోగ్యం వచ్చినా క్షణాల్లో చికిత్స అందించడానికి వీలవుతుందని పశువైద్యులు చెప్పారు. కార్డుల్లో గతంలో అనారోగ్యానికి గురైనపుడు అందజేసిన చికిత్స వివరాలు కూడా క్షణాల్లో తెలుసుకునే వీలుండటంతో ఎలాంటి వైద్యం చేయాలో వైద్యులకు, సిబ్బందికి వెంటనే తెలుస్తుంది.ఇలాంటి సౌకర్యం పాడి రైతులకు అందజేయాలన్న సీఎం సంకల్పం గొప్పది.

– కర్రి లక్ష్మణరావు, పాడి రైతు, మార్టూరు

సచివాలయాల ద్వారా అందజేస్తున్నారు



పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు సచివాలయాల ద్వారా అందజేస్తున్నారు. దీంతో పాడి రైతులకు శ్రమ తప్పింది. వీటి ఉపయోగాలపై రైతులకు పశుసంవర్ధకశాఖ అధికారులు, ఆర్బీకే సిబ్బంది వివరిస్తున్నారు. ఈ కార్డులతో ఎన్నో ఉపయోగాలున్నాయి. పాడి రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అరోగ్య సరక్షణ కార్డులు అందించడం మాకెంతో మేలు చేస్తోంది

– బొడ్డేటి సూర్యనారాయణ రెతు, పిసినికాడ

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



పాడి రైతుల కోసం ప్రత్యేకంగా ఆరోగ్య సంరక్షణ కార్డులివ్వాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మేమంతా రుణపడి ఉంటాం. పశువులకు అనారోగ్యం చేస్తే ఆందోళన చెందనవసరంలేదు. ఆరోగ్య కార్డుందన్న ధీమా పాడి రైతుల్లో ఉంది. కార్డుపై ముద్రించిన 1962 నంబరుకు ఫోన్ చేస్తే ఇంటికే వచ్చి మూగజీవాలకు తగు చికిత్స అందిస్తున్నారు. దీనివల్ల పశువుల ఆరోగ్యంపై ఆందోళన తప్పింది సీఎం జగన్‌కు మేమంతా ఋణపడి ఉంటాం.

– కర్రి చంద్రరావు, రైతు, వెంకుపాలెం

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



డిస్‌ప్లేబోర్డును ఆవిష్కరిస్తున్న భరత్‌కుమార్,దిలీప్‌కుమార్,

అనకాపల్లి: రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలో పిసినికాడ సచివాలయంలో శనివారం నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్ దారులకు రూ.3వేలు అందించి అవ్వతాతల్లో ఆనందాన్ని నింపిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. సాధ్యంకాని హామీలు ఇచ్చి అన్నివర్గాలవారిని ఓటుబ్యాంకుగా వాడుకున్న చంద్రబాబు మాటలు నమ్మవద్దని చెప్పారు. టిడ్కో గృహాలు పేదలకు రూపాయికే అందించి పేదోడికి సంక్రాంతి పండగను తమ ప్రభుత్వం ముందే తీసుకొచ్చిందన్నారు. విద్య, వైద్యరంగాల్లో విప్లవాత్మకమార్పులు తీసుకొచ్చినట్టు చెప్పారు. ఆరోగ్యసురక్ష ద్వారా పేదలకు నాణ్యత గల వైద్యం, మందులు, పలు పరీక్షలు అందుతున్నాయని చెప్పారు. అంతకుముందు సచివాలయంలో డిస్‌ప్లేబోర్డును ఆవిష్కరించి ఎవరెవరికి ఏ మేర లబ్ధి చేకూరిందో వివరించారు. బ్రోచర్లను గ్రామస్తులకు పంపిణీ చేసి, అక్కడే పార్టీ జెండా ఆవిష్కరించి పల్లెనిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, సర్పంచ్ యల్లపు వెంకటరమేష్, ఎంపీటీసీ మొల్లేటి హైమా, పార్టీ శ్రేణులు బుద్ధ నాగేశ్వరరావు, పెదిశెట్టి రమేష్, నీలకంఠ లక్ష్మి, ఈవోఆర్డీ ధర్మారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ వద్ద వృద్ధుల నిరసన

అనకాపల్లి: స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధులు శనివారం ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ వృద్ధులకు రైల్వేటిక్కెట్లలో రాయితీ కల్పించాలంటూ డిమాండ్ చేశారు. టిక్కెట్లలో రాయితీ కల్పించకపోవడంతో వృద్ధులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అంతకుముందు స్టేషన్ మేనేజర్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వినకోట నీలేష్‌గుప్త, రొబ్బి మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణమోహన్, కొత్తూర్తి రామారావు, బొడ్డు సోమరాజు, వృద్ధులు కె.నారాయణరావు, వై.ఆదినారాయణ పాల్గొన్నారు.



స్టేషన్ ముందు ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వృద్ధులు

ప్రజల మధ్య విద్వేషాలు రేపుతున్న బీజేపీ

అనకాపల్లి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య విద్వేషాలు రేపుతోందని కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఐ.ఆర్.గంగాధర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. భారతరాజ్యాంగ స్ఫూర్తిని, విలువలను నిర్వీర్యం చేస్తూ పాలన కొనసాగితే భారత రాజ్యాంగం అస్తిత్వమే కోల్పోయే ప్రమాదముందన్నారు. ప్రజావ్యతిరేక బీజేపీని కేంద్రంలో గద్దెదించేందుకు జాతీయస్థాయిలో 28 రాజకీయపక్షాలతో ' ఇండియా' కూటమి ఏర్పడి ప్రత్యామ్నాయంగా ముందుకు వస్తున్న విషయం తెలిసిందేనన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు, దళిత, గిరిజన, క్రైస్తవ, బీసీ, మైనార్టీ ప్రజల హక్కుల పరిరక్షణకు, ఇండియా కూటమికి అండగా నిలవాల్సినవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కొల్లి సత్యారావు, దాసరి సంతోష్, వీరేశ్వరపు రాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గంగాధర్

విలువ ఆధారిత ఉత్పత్తులతో అధిక ఆదాయం




పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జగన్నాథరావు, ఆశాదేవి, శాస్త్రవేత్తలు

అనకాపల్లి: విలువ ఆధారిత ఉత్పత్తులతో అధిక ఆదాయాన్ని పొందవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం (ఆర్ఏఆర్ఎస్) ఏడీఆర్ పి.వి.కె. జగన్నాథరావు అన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో మహిళ రైతులకు ఆత్మప్రాజెక్టు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో జగన్నాథరావు మాట్లాడుతూ విలువ ఆధారిత ఉత్పత్తులపై మహిళా రైతులు దృష్టి సారించాలన్నారు. ఆత్మప్రాజెక్టు డైరెక్టర్ ఆశాదేవి మాట్లాడుతూ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా అధిక లాభాలు పొందవచ్చన్నారు. బెల్లం, చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చారు. అంతకుముందు విలువ ఆధారిత ఉత్పత్తులపై ముద్రించిన రెండు పుస్తకాలను జగన్నాథరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి.ఉమామహేశ్వరరావు, పి.ఆదిలక్ష్మి, కె.వి.రమణమూర్తి, ముకుందరావు, ఎం. విశాలాక్షి, 60 మంది మహిళా రైతులు పాల్గొన్నారు.

నందనందనా గోవింద

కశింకోట: స్థానికంగా గల రెండు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామిని శనివారం శ్రీకృష్ణునిగా అలంకరించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి, గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామిని విష్ణుమూర్తి దశావతారాల్లో ఒకటైన శ్రీకృష్ణునిగా అందంగా అలంకరించారు. పాశుర విన్నపం, తిరుప్పావై పారాయణం చేశారు. శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయాల అర్చకులు రేజేటి రామచరణాచార్యులు, సుబ్రహ్మణ్యంలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



శ్రీకృష్ణుని అలంకరణలో ధ్యాన వేంకటేశ్వరస్వామి



గవరపేటలో వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు సుబ్రహ్మణ్యం

ఆహ్లాదకరంగా 'జలగలమదుం కూడలి'



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి: స్థానిక జలగలమదుం కూడలిలో గల జాతీయజెండాకు ఇరువైపులా ప్రాంతాన్ని ఎంపీ సత్యవతి ఆదేశాల మేరకు హరితవనంగా తీర్చిదిద్దేందుకు అటవీ, నేషనల్ హైవే అథారిటీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడ సుమారు 1000 మొక్కలు నాటనున్నారు. ఈ పనులను శనివారం ఎంపీ సత్యవతి పరిశీలించి మాట్లాడారు. రాబోయే రోజుల్లో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు ఈ ప్రాంతాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామన్నారు.

ఇచ్చిన హామీకి కట్టుబడి పింఛను పెంపు

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి అమర్‌నాథ్
- కశింకోటలో భారీ ఎత్తున పింఛన్ల పంపిణీ



కశింకోటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ , ఎంపీ సత్యవతి



బర్త్‌డే కేకును ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతితో కలిసి కట్ చేస్తున్న మంత్రి అమర్‌నాథ్



సభకు హాజరైన పింఛన్ లబ్ధిదారులు

కశింకోట: ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం కశింకోటలో శనివారం పండగవాతావరణంలో పెద్ద ఎత్తున జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2019 నాటికి పింఛన్లకు నెలకు రూ.450 కోట్లు చెల్లించే వారని, ఇప్పుడు 66 లక్షల మందికి రూ.1,950 కోట్లు చెల్లిస్తున్నట్టు చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు మూడు విడతలుగా రూ.19,500 కోట్లు ప్రభుత్వం చెల్లించిందని, నాలుగో విడతగా ఈ నెల 23 నుంచి నెలాఖరు వరకు రూ.6500 కోట్లు చెల్లించడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. చేయూత పథకం ఆర్థిక సహాయాన్ని వచ్చే ఫిబ్రవరి నెల 5 నుంచి 14 వరకు చెల్లించనున్నట్టు చెప్పారు. కోవిడ్ సమయంలో కూడా ఏనాడూ సంక్షేమ కార్యక్రమాలు ఆగలేదన్నారు. గతంలో పింఛన్ తీసుకోవడానికి పంచాయతీ కార్యాలయాల వద్ద వృద్ధులు పడిగాపులు కాయవలసి వచ్చేదని, ఇప్పుడు సూర్యోదయానికి ముందే గ్రామ వలంటీర్లు ఇంటి తలుపు తట్టి పింఛన్ సొమ్మును ఠంచన్‌గా అందజేస్తున్నారన్నారు.

రెండు,మూడు నెలల్లో రాష్ట్రంలో ఎన్నికలు రానున్న దృష్ట్యా ప్రతి పక్షాల వారు వచ్చి ఇంత కంటే ఎక్కువ పథకాలు ఇస్తామని కల్లబొల్లి మాటలు చెబుతారని, వారి మాటలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇప్పటిలాంటి సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయలేకపోయారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, ఇప్పటి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను బేరీజు వేసుకొని ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కశింకోట మేజర్ పంచాయతీలో 800 మందికి ఇళ్లు మంజూరు చేసి, నిర్మించుకోవడానికి ఆర్థిక సహాయం అందించామన్నారు. కోర్టు కేసుల్లో ఉన్న 150 ఇళ్లకు కేసుల నుంచి విముక్తి కలిగించి లబ్ధిదారులకు ప్రయోజనం కలిగించామన్నారు. కశింకోటలో సుమారు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించినట్టు చెప్పారు. కోటి రూపాయలకు పైగా వెచ్చించి అరబిందో పరిశ్రమ సహకారంతో పెద్ద కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నామని, 15 రోజుల్లోగా ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నామ మాత్రపు రుసుంతో ఈ కల్యాణ మండపాన్ని శుభ కార్యాలకు అందివ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. శారదా నదిపై అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెనను పూర్తి చేసే బాధ్యతను వైఎస్సార్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. రూ.1.60 కోట్లతో మండలంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి ప్రజలు సహకారం అందించాలన్నారు.

ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చి భవిష్యత్తు తరాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో 11 వైద్య కళాశాలలు మాత్రమే ఉండేవని, ఇప్పుడు ఒక్క మన రాష్ట్రంలోనే ఒకేసారి 17 వైద్య కళాశాలలను మంజూరు చేసిన ఘనతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దక్కించుకున్నారన్నారు. తన ఎంపీ నిధుల నుంచి కశింకోటలో ఎస్సీ ప్రాంతంలో రూ.కోటితో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. హౌసింగ్ కాలనీలో రూ.45 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించామన్నారు. రెండు శ్మశానాల అభివృద్ధికి రూ.5 లక్షల చొప్పున ఖర్చు చేసినట్టు చెప్పారు. రూ.50 లక్షలతో ఇందిరా కాలనీలో డాక్టర్ అంబేడ్కర్ కల్యాణ మండపాన్ని నిర్మించనున్నామని తెలిపారు. శారదా నదిపై అసంపూర్తి వంతెనను తప్పనిసరిగా నిర్మించి తీరుతామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. అనకాపల్లి నియోజక వర్గ సమన్వయకర్త మలసాల కుమార్‌రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి రూ.3 వేలకు పింఛన్ పెంచి అందిస్తున్నారన్నారు. ఇందుకు ప్రజలు కృతజ్ఞతగా నిలవాలన్నారు.

ఘనంగా మంత్రి ముందస్తు జన్మదిన వేడుకలు

మంత్రి అమర్‌నాథ్‌కు ముందస్తు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎంపీ వెంకట సత్యవతితో కలిసి అమర్‌నాథ్ కేక్ కట్ చేశారు. వైఎస్సార్ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ కె. విష్ణుమూర్తి, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, ఎంపీపీలు కలగా లక్ష్మి, గొర్లి సూరిబాబు, మాజీ ఎంపీపీ మలసాల కాసులమ్మ(ధనమ్మ),జెట్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు,అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, పెద్ద సంఖ్యలో కశింకోట, వెదురుపర్తి గ్రామాల నుంచి పింఛన్‌దారులు పాల్గొన్నారు.